ప్రజాశక్తి
గురువారం 5 జూన్ 2025
5
పార్వతీపురం మన్యం



11న సీతంపేటలో జాబ్ మేళా

పార్వతీపురం : సీతంపేట యూత్ ట్రైనింగ్ సెంటర్లో ఈనెల 11న జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువు కొని 18 నిండి 28 ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 11 సీతంపేటలో జరుగు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని అన్నారు. ఈ జాబ్ మేళాలో 11 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబరుతో పాటు బయో డేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్ మరియు జెరాక్స్, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో జరుగు ప్రదేశంలో హాజరుకావాలని కోరారు.

రేషన్ కోసం గిరిజనుల అవస్థలు

- సరుకుల కోసం తప్పని పాట్లు
- కాలినడకన కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకుంటున్న వైనం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని గిరిజన పంచాయితీలకు చెందిన ప్రజలు రేషన్ తీసుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రావికోన, ఆడారు, వెలగవలస, డికె పట్నం బుదురువాడ, సంగం వలస, మూలగ పంచాయతీల గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిరోజుల క్రితం ఎండియుల ద్వారా రేషన్ ఆయా గ్రామాలకు వెళ్లి పంపిణీ చేశారు. అయితే ఈ నెల ఒకటి నుంచి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల రేషన్ షాపుల్లో రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయా గిరిజన గ్రామాల ప్రజలు పంచాయతీ కేంద్రాలకు చేరుకుని రేషన్ తీసుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సిపిఎం మండల నాయకులు పి.రాము స్పందిస్తూ గతంలో ఇచ్చినట్లుగానే రేషన్ వాహనాల ద్వారా ఆయా గ్రామాలకు సరుకులు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయం వల్ల గిరిజన గ్రామానికి చెందిన ప్రజలు రేషన్ పొందడానికి ప్రయాసలు పడుతున్నారని, వెంటనే ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించి వాహన ద్వారా గిరిజన గ్రామాల్లో రేషన్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

వీరఘట్టం : ఎండియు వాహనాల ద్వారా లబ్ధిదారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వీలుగా ప్రతినెలా బియ్యం పంపిణీ చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈనెల నుంచి ఎండియులకు స్వస్తి పలికి డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. దీంతో అటు ఎండియు ఆపరేటర్లు వీధిన పడడంతో పాటు కార్డుదారులు కూడా బియ్యం తెచ్చుకునేందుకు భారంగా మిగిలింది. మండలంలోని కాగితాడ గిరిజన గ్రామస్తులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కంబర గ్రామ రేషన్ డిపోకు వచ్చి నిత్యవసర సరుకులను తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పెద్దూరు, సింధునగర్ గిరిజన గ్రామస్తులు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న దశమంతపురానికి వచ్చి నిత్యవసర వస్తువులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కె.ఇచ్ఛాపురం, బల్లగుడ్డు, రామాపురం, వంకాయలగెడ్డ గిరిజన గ్రామస్తులు కిలోమీటర్ల దూరంలో ఉన్న గంగంపేట రేషన్ డిపోకు వచ్చి నిత్యవసర వస్తువులు విడిపించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రాయమానుగుడ, సంధిమానుగూడ, పాలగూడ, ఎలీషాపురం, గదబవలస, నీలం పేట, శాంతిగూడ, కొత్తగూడ గ్రామ గిరిజనులు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న హుస్సేన్‌పురం వచ్చి రేషన్ డిపోకు వచ్చి నిత్యవసర వస్తువులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బట్టిగూడ గిరిజనులు నర్సిపురం గ్రామ రేషన్ డిపోకు వచ్చి నిత్యవసర వస్తువులు విడిపించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండవానిగోర, మామిడిమానుగోర గిరిజనులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నగోర కాలనీ గిరిజన గ్రామ రేషన్ డిపోకు వచ్చి నిత్యవసర వస్తువులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ గ్రామాలకు రేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.



గౌరీ పురం నుంచి రేషన్‌ను తీసుకెళ్తున్న గిరిజనులు

50 పడకల ఆస్పత్రిని ప్రారంభించాలి

ప్రజాశక్తి -కురుపాం

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి సమీపాన నిర్మాణం పూర్తయి చివర దశలో ఉన్న 50 పడకల ఆసుపత్రిని తక్షణమే ప్రారంభించి రోగులకు సరిపడా బెడలు, ఇతర సదుపాయాలతో పాటు నాణ్యమైన వైద్యం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి నేరుగా రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మౌలికల వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆసుపత్రి కనుక చుట్టుపక్కల గ్రామాల నుంచి జ్వరాలతోనూ, ఇతర అనారోగ్య సమస్యలతో నిత్యం రోగుల తాకిడి ఎక్కువగా ఉందన్నారు. దీనికి తోడు ఇటీవల కాలంలో గిరిజన గ్రామాల్లో మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు విపరీతంగా ఉండడంతో ఆసుపత్రికి రోగులు రోజుకు 150 నుంచి 200 ఒపి పెరగడం, పేషెంట్లకు తగ్గ బెడ్లు లేకపోవడంతో ఒక్కొక్క బెడ్‌పై ముగ్గురు, నలుగురు చొప్పున ఉంటూ వైద్యం పొందుతున్నారని అన్నారు. అంతేకాకుండా అదే బెడ్ మీద జ్వరంతో బాధపడే రోగులు, డయారియా పేషెంట్లు, అప్పుడే ప్రసవమైన బాలింతలు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరికీ ఒకే వార్డులో వైద్య సిబ్బంది వైద్యం అందిస్తున్నారని, దీంతో బాలింతలకు చిన్న పిల్లలకు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, కావున తక్షణమే ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి 50 పడకల ఆస్పత్రినివెంటనే ప్రారంభించి రోగులకు బెడ్లతో పాటు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

● సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు



రోగులను పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

సిహెచ్‌సిని సందర్శించిన డిసిహెచ్‌ఎస్

ప్రజాశక్తి వార్తకు స్పందన

స్థానిక సిహెచ్‌సిని జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ జి.నాగభూషణం బుధవారం సందర్శించారు. 'ప్రజాశక్తి'లో బుధవారం ప్రచురితమైన 'ఇంటింటా జ్వరపీడితులే' అన్న వార్తకు ఆయన స్పందించారు. ఈ సందర్భంగా సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న రోగులకు అందుతున్న వైద్య సేవలు, వారికి ఉన్నటువంటి బెడ్‌లను పరిశీలించారు. అనంతరం కొత్తగా నిర్మాణం జరిగిన 50 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత సిబ్బందితో మాట్లాడే ఆస్పత్రిని వెంటనే ప్రారంభించి రోగులకు సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శోభారాణి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



50పడకల ఆసుపత్రిని పరిశీలిస్తున్న డిసిహెచ్‌ఎస్

సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి పను లు పూర్తి చేయాలి :సిపిఎం

సీతంపేట : సీతంపేటలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషల్ హాస్పిటల్ వెంటనే పూర్తి చేసి గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.భాస్కర్ రావు డిమాండ్ చేశారు. ఈ హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఈ హాస్పిటల్ వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదన్నారు. ఈ ప్రాంతంలో గిరిజనులకు మెరుగైన వైద్యం అందకు ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరి వేలాది రూపాయలు అప్పుల పాలౌవుతున్నారన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తికానిచో ఆదివాసీ ప్రజానీకంతో ఆందోళన చెప్పడతామని హెచ్చరించారు.

ధోనుబాయి పిహెచ్‌సి సందర్శన

మండలంలో ధోనుబాయి పిహెచ్‌సిని జిల్లా మలేరియా అధికారి పివి సత్యనారాయణ బుధవారం సందర్శించారు. స్ప్రేయింగ్‌పై ఆరా తీశారు. జ్వరపీడితుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఫోకల్ స్ప్రేయింగ్ నిర్వహించాలన్నారు. స్ప్రేయింగ్‌పై అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు సీతంపేట ఐటిడిఎ సమీపంలో ఉన్న గిరిజన బాలుర గురుకుల కళాశాల జరుగుతున్న పోకల్ స్ప్రేయింగ్ గురించి పరిశీలించారు. స్ప్రేయింగ్ త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఆయన వెంట మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, ఎఎంఒ శ్రీనివాసరావు, సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - పాలకొండ

సమావేశానికి పిలిచినట్టు పిలిచి గైర్హాజరైన ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, మాజీఎంపిపి ప్రతినిధి డిమాండ్ చేశారు. తోటపల్లి ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన ఆందోళనకు స్పందించిన అధికార యంత్రాంగం బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 12 గంటలకు సబ్ కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. అయితే మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఇరిగేషన్ అధికారులు ఎవరూ రాకపోవడంతో సబ్ కలెక్టర్ తాను సీతంపేట ఐటిడిఎకు వెళ్లాలని, ఇరిగేషన్ అధికారులు రాలేదని వెళ్లిపోవడంతో రైతు సంఘం నాయకులు అసహనం చెందారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ తమకు సమావేశం ఉందని పిలిచి సంబంధిత అధికారులు రాకపోవడమేమిటని ప్రశ్నించారు. సమావేశానికి హాజరుకాని అధికారులు ఖరీఫ్‌కు నీరిస్తారంటే అనుమానంగా ఉందని అన్నారు. వెంటనే సబ్‌కలెక్టర్ స్పందించి ఇరిగేషన్ అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ ప్రతినిధి వారాడ సుమంత్ నాయుడు కూడా ఇరిగేషన్ అధికారుల తీరుపై అసహనం చెందారు. సబ్ కలెక్టర్ పిలిస్తేనే ఇరిగేషన్ అధికారులు రాకపోతే రైతుల పిలిస్తే వస్తారా అంటూ మండిపడ్డారు. దీనిపై ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరితో పాటు మాజీ ఎంపిటిసి సభ్యులు కారపు చిట్టిబాబు, అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ఎద్దుబోయిన సింహాద్రి, వావిలపల్లి రామ్మూర్తి ఉన్నారు.

హామీలను అమలు చేయని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - సాలూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేదని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను వైసిపి వెన్నుపోటు దినంగా ప్రకటించి నిరసన ర్యాలీలు చేపట్టాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర నాయకత్వంలో పట్టణంలో బుధవారం నిర్వహించిన నిరసన ర్యాలీకి సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాలతో పాటు మున్సిపాలిటీల నుంచి వేలాదిమంది జనం హాజరయ్యారు. ప్రధాన రహదారి మీదుగా బోసు బొమ్మ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆ జంక్షన్‌లో ఉన్న స్వాతంత్ర్య సమర యోధుడు సుభాష్ చంద్రబోస్, మాజీ సిఎం వైఎస్సార్ విగ్రహాలకు రాజన్నదొర పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో హెచ్‌డిటి భానుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ ఎన్నికల ముందు టిడిపి కూటమి పార్టీలు లేనిపోని ఆశలు కల్పించి, ఆచరణ సాధ్యం కాని హామీ లిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేశారని విమర్శించారు. వాలంటీర్లకు పదివేలు జీతం చెల్లిస్తామని చెప్పి తొలగించిందని చెప్పారు. ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీ కోసం ప్రవేశపెట్టిన ఎమ్ డియూ ఆపరేటర్లను తొలగించి తీరని అన్యాయం చేసిందని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు మావుడి రంగు నాయుడు,వాసు నాయుడు,దండి శ్రీనివాసరావు,డోల బాబ్జీ,పాచిపెంట చినబాబు,గొట్టాపు ముత్యాల నాయుడు,సలాది అప్పలనాయుడు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ,పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు గిరి రఘు,మెంటాడ మండలనాయకులు రెడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.



సాలూరులో ర్యాలీ చేస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర, వైసిపి నాయకులు


టిడిపి గుండెల్లో గుబులు

మంత్రి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో వైసిపి నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతం కావడంతో అధికార పార్టీ గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు కూడా కార్యక్రమాలకు హాజరు కాని రీతిలో జనం రావడంతో జీర్ణించుకోలేని పరిస్థితి కనిపిస్తోంది. ఈనెల 1న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర జన్మదిన వేడుకల సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెప్పడానికి వేలాదిమంది ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు. అది మరువకముందే బుధవారం నిర్వహించిన వెన్నుపోటు నిరసన ర్యాలీకి వేలాది మంది హాజరు కావడం అధికారపార్టీ నాయకులకు అంతుచిక్కని పరిణామంగా తయారైంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, మంత్రిగా సంధ్యారాణి బాధ్యతలు స్వీకరించిన ఏడాది కాలంలోనే పెద్ద ఎత్తున ప్రజావ్యతిరేక పవనాలు వీస్తుండడం చర్చనీయాంశమవుతోంది.

పార్వతీపురం టౌన్ : టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు వెన్ను పోటు పొడిచిందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పాలనకు నిరసనగా వెన్నుపోటు దినం భారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు భారీ సంఖ్యలో ప్రజలతో కలిసి సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెసి ఎస్ఎస్ శోభికకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండలాలు, పట్టణ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్‌చైర్మన్లు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వైస్ ఎంపిపిలు, జిల్లా పార్టీ ప్రతినిదులు, సర్పంచ్లు, ఎంపిటిసి సభ్యులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ : కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను తక్షణమే పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి అన్నారు. వైసిపి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమం బుధవారం చేపట్టారు. స్థానిక కోట దుర్గ గుడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ కార్యాలయంలో ఇఒ అప్పారావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పట్టణ, మండల వైసిపి కన్వీనర్లు వెలమల మన్మధరావు, కనపాక సూర్యప్రకాష్, వీరఘట్టం ఎంపిపి డి.వెంకటరమణ, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కడగల రమణ, బాసురు కాంతారావు, కె.విజయకుమార్, పల్లా భాను, తూముల లక్షణ, లిల్లీ పుష్పనాధం తదితరులు ఉన్నారు.

కురుపాం :వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాదరావు విమర్శించారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా స్థానికధూకేశ్వర ఆలయం నుంచి రెవెన్యూ కార్యాలయం వరకూ వైసిపి శ్రేణులు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ ఎం.రవణమ్మకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శెట్టి పద్మావతి, కుంబరిక దీనమయ్య శెట్టి శ్యామల, జడ్పిటిసిలు జి.సుజాత, ఎం.శశికళ, జడ్పీ కో ఆప్షన్ షేక్ నిషార్, మండల కో ఆప్షన్ షేక్ జిలాని, వైసిపి మైనార్టీ సంయుక్త రాష్ట్ర కార్యదర్శి షేక్ నూరుళ్ల, మండల కన్వీనర్లు, వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జెసికి వినతిని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, వైసిపి శ్రేణులు

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక జిల్లా కేంద్రాసుపత్రిని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అన్ని వార్డుల్లోనూ తిరిగి రోగులతో మాట్లాడి వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యం, మందులు గురించి వివరాలు అడిగారు. అలాగే ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి రోగులకు అందిస్తున్న సేవలు గురించి ఆరా తీశారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులు, వైద్య పరీక్షల పరికరాలు, వసతులు గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందించే వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే, వైద్యులకు, సిబ్బందికి హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేను కలిసిన డిసిసిబి చైర్మన్

ప్రజాశక్తి - పాలకొండ

విజయనగరం జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన కిమిడి నాగార్జున బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయ పరిస్థితులతో పాటు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, పట్టణ టిడిపిఅధ్యక్షులు గంట సంతోష్ కుమార్, నాయకులు జాడ శ్రీధర్, జవరాజు తదితరులు ఉన్నారు.

పార్వతీపురంరూరల్ : డిసిసిబి అధ్యక్షుడిగా నియమితులైన కిమిడి నాగార్జున ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కలిశారు. ఆదివారం జరగనున్న తన ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని నాగార్జున ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర, కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కిమిడి నాగార్జునను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



నాగార్జునను అభినందిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -సీతానగరం

మధ్యాహ్న భోజన కార్మికులను ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరంచాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో మండల విద్యాశాఖ నిర్వహించిన మధ్యాహ్న భోజన నిర్వాహకుల సన్నాహక సమావేశంలో పాల్గొన్న నిర్వాహకులు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేసి, అనంతరం ఎంఇఒ ఎం.వెంకటరమణకు వినతిని అందజేశారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకట రమణ, మధ్యాహ్నభోజన కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతి కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకంలో అనేక మార్పులు ప్రవేశపెట్టిందని ఆ మార్పులకు అనుగుణంగా, నిర్వాహకులకు పెరిగిన పని భారానికి తగిన విధంగా పారితోషకం పెంచడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు రూ.10 వేలకు వేతనం పెంచాలని, విద్యార్థులకు ఇస్తున్న రేషన్ సరుకులు సరిపడినన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి న్యాయం చేయాలని, లేనిచో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం నాయకులు ఎస్.లక్ష్మి, సిహెచ్, ఆదిలక్ష్మి, సావిత్రి, పెంకి కుమారమ్మ, తదితర కార్మికులు పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతిని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నేడు ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో యోగాంధ్ర

ప్రజాశక్తి - పార్వతీపురం

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం సీతంపేట ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్‌లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున చేపడుతున్నామని చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో నిర్వహణలో భాగంగా గురువారం ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్‌లో యోగా కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

12న వెంగళరాయ సాగర్ వద్ద

ఈనెల 12న మక్కువ మండలం వెంగళరాయ సాగర్ వద్ద గల ఏనుగు కొండ దగ్గర యోగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

రహదారుల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ ద్వారా చేపట్టిన సిసి రహదారులకు విజిలెన్స్ ఎస్‌పి బి.ప్రసాదరావు బుధవారం తనిఖీ చేపట్టారు. నారాయణగూడ, జోడిమానుగూడ, లోకొత్తవలస, ఎగువ సంకిలి, దిగువ సంకిలి, సిసి రహదారులను తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలు పరిశీలించారు. కోర్ కట్‌ను వినియోగించించారు. ఈయన వెంట డిఇ సింహాచలం, ఎఇ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో గ్రామదేవత పండగ విజయవంతం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పట్టణంలో మూడురోజుల పాటు జరిగిన ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ, బంగారమ్మ అమ్మవార్ల పండగలను సమిష్టి కృషితో ఘనంగా జరుపుకున్నామని, ఇందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రకటించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మూడేళ్ల తర్వాత జరుపుకున్న ఈ పండుగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా జరిగిందన్నారు. మున్సిపల్ శాఖ అధికారులు నిరంతరం తాగునీరు, పారిశుధ్యం పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేశారని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో లోటుపాట్లు లేకుండా ప్రత్యేక శ్రద్ధ కనబర్చారని వెల్లడించారు. వైద్య శాఖ అధికారులు పండగ మూడు రోజులు ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారన్నారు. పోలీసులు ప్రత్యేక శ్రద్ధ చూపి ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా ప్రజలను చక్కగా సమన్వయపర్చాన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు నిరంతరం కష్టపడి వేడుకలు ఘనంగా జరిగేలా చర్యలు చేపట్టారని తెలియజేశారు. అటు అధికారులు ఇటు కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి పండుగలను గొప్పగా జరిపించారని కొనియాడారు.



పోలమాంబకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఘనంగా ఏడూళ్ల పోలమాంబకు పూజలు

ప్రజాశక్తి -మక్కువ

మండలంలోని మార్కొండ పుట్టి పంచాయతీలోని పెదగాసిలో ఏడూళ్ల పోలమాంబ అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు బుధవారం జరిగిన వినాయక పూజ మొదలుకొని హోమం ,అర్చనల వరకు జరిగిన పూజా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నాలుగు గ్రామాల మహిళలు పాల్గొన్నారు. మక్కువకు చెందిన వేద పండితులు విజయశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులంతా కలసి పూజా కార్యక్రమాలతో పాటు అన్నదానం చేపట్టారు. గురువారం ఆలయం పై భాగంలో కలశ ప్రతిష్టాపనతో పాటు దీక్షల విరమణ మహా అన్నదానంతో ఈ కార్యక్రమాలు ముగియనున్నాయి .

ప్రజలను నట్టేట ముంచిన జగన్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు సమర్ధవంతమైన పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని వెన్నుపోటు అనడం సిగ్గుచేటని స్థానిక ఎమ్మెల్యే బోనేల విజయచంద్ర ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కేకు కట్‌చేసి తినిపించుకున్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, మోడీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాలకు తీవ్ర అన్యాయం చేసిన జగన్ ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. డబ్బు కోసం సొంత అమ్మ, చెల్లిని బయటకు గెంటేసి కుట్రలు చేస్తున్న జగన్‌కు ఇప్పటికీ జ్ఞానోదయం కలగలేదని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్పత్రి పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరిలో గల 50 పడకల ప్రభుత్వాసుపత్రి పనులను డిసిహెచ్ఎస్ జి.నాగభూషణ్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం పరిశీలించారు. ఆసుపత్రి భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. నిర్మాణం పూర్తయితే గిరిజన ప్రజలకు మరింత వైద్య సేవలు మెరుగుపడతాయని అన్నారు.

గర్భిణులకు రక్తహీనతపై అవగాహన


ప్రజాశక్తి - కురుపాం

గర్భిణులు రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉండడానికి ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవాలని రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చీకటి శంకరరావు కోరారు. బుధవారం కురుపాంలో రక్తహీనత నివారణ కమిటీ (అనిమియా యాక్షన్ కమిటీ) సమావేశం జరిగింది. వైద్య సిబ్బంది రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారికి ఐరన్ మాత్రలు, పోషకాహారం అందేలా చూడాలని కోరారు. ముఖ్యంగా గర్భిణీలకు హెచ్‌బి టెస్టు చేసి రక్తహీనత ఉన్నవారికి ప్రత్యేక శ్రద్ధ వహించి పౌష్టికాహారం తీసుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం ఉపయోగాలపై గర్భిణీలకు అవగాహనపర్చారు. కార్యక్రమంలో సిడిపిఒ కె.విజయగౌరి, అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, గర్భిణీలు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో భాగంగా తోటపల్లి జట్టు ఆఫీస్ వద్ద ఎడిఎ, ఎంఎఒ ప్రకృతి వ్యవసాయంపై శిక్షణఇచ్చారు. ఎడిఎ మధుసూదనరావు ఆధ్వర్యాన మూడురోజుల శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలు డివిజన్ స్థాయిలో విఎఎలు, విహెచ్‌ఎలకు శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల లాభాలు, 365రోజులు భూమిని కప్పి వుంచే విధానంపై అవగాహన కల్పించారు. వేరు వ్యవస్థ కార్బన్ స్థిరీకరణ పద్ధతులు భూమిలో వచ్చే మార్పులు ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు వివరించారు. జట్టు వ్యవపకులు డాక్టర్ డి.పారినాయుడు, మరిశచర్ల బాబూజీ మానవజీవనం సజావుగా సాగాలంటే ప్రకృతి వ్యవసాయం ప్రతి ఒక్కరూ చేయాలని సూచించారు. కార్యకమానికి సంబంధించిన స్టేట్ టీమ్ ప్రతినిధి మన్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎడిఎ మధుసూదనరావు

రక్తహీనతతో ఎవరూ బాధపడకూడదు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలో ఏ ఒక్కరూ రక్తహీనతతో బాధపడకూడదని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని ఎంఆర్ నగర్ గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన రక్తహీనత నివారణ కమిటీ (అనిమియా యాక్షన్ కమిటీ)లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి సచివాలయ పరిధిలో అనిమియా యాక్షన్ కమిటీ సమావేశాన్ని ప్రతి నెలా మొదటి బుధవారం నిర్వహిస్తున్నామన్నారు. గర్భిణులు, డెలివరీ కేసులను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలని, అలాగే వారికి చేయాల్సిన నెలవారీ పరీక్షలు, ప్రసవం అనంతరం పసిపిల్లలకు సమయానుకూలంగా ఇవ్వాల్సిన ఇంజక్షన్లు తదితర వాటిని ఎఎన్ఎంలు బాధ్యతాయుతంగా చేయాలన్నారు. ఎఎన్ఎం, ఆశా వర్కర్, సిహెచ్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఒలు స్వయంగా ప్రతి ఇంటికీ వెళ్లి అనిమియా లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి, అనిమియా నివారించే దిశగా పని చేయాలన్నారు. అనిమియా లోపంతో బాధపడుతున్న వారి పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనిమియా నివారణకు వైద్యాధికారులు, సిబ్బంది పనిచేయాలని స్పష్టం చేశారు. అనిమియా పేషంట్లను దత్తత తీసుకొన్న వైద్యాధికారులు, వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ వారిలో అనిమియాను నివారించేందు కృషి చేయాలని సూచించారు. ఖాళీ స్థలంలో, పెరటిలో ఆకుకూరలు పండించేందుకు విత్తనాలు అందించడం జరుగుతోందని ఆయన చెప్పారు. అంగన్వాడీ సరుకులు, టాబ్లెట్‌లు, ఇంజక్షన్లు సకాలంలో అందిస్తున్నారా లేదా అని గర్భిణీలను ఆయన ఆరా తీశారు. గర్భిణీలను ఆపరేషన్ కాకుండా నార్మల్ డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. గర్భిణులతో యోగా, చిన్నచిన్న వ్యాయమాలు చేయించాలన్నారు. సమావేశం అనంతరం ప్రజలతో కలిసి టిబి వ్యాధి పట్ల శ్రద్ధ వహించండి, టిబి రహిత భారత్‌కు సహకరించండి అనే గోడ పత్రికను విడుదల చేశారు.



టివిరహిత భారత్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వికలాంగులకు, వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ : కలెక్టర్

వికలాంగులకు, 65 ఏళ్లుపైబడిన వృద్ధులకు ఇళ్ల వద్దనే రేషన్ సరుకులను సరఫరా చేస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఎంఆర్ నగర్‌లో బుధవారం రేషన్ డిపోను కలెక్టర్ తనిఖీ చేశారు. చౌక ధరల దుకాణం వద్దకు రేషన్ కోసం వచ్చిన లబ్ధిదారులకు స్వయంగా తూకం వేసి రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ సరుకులను ఇకపై చౌక ధరల దుకాణాల వద్ద పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతి నెలా 1నుంచి 15 వరకు రేషన్ సరుకులు లభిస్తాయని చెప్పారు. ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో రేషన్ సరుకులను చౌక ధరల దుకాణాల వద్ద తీసుకోవచ్చని చెప్పారు. వికలాంగులకు, 65 ఏళ్లుపైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులను సరఫరా చేస్తామని తెలిపారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా టిబి నియంత్రణాధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, తహశీల్దార్ వై.జయలక్ష్మి, సిడిపిఒ బి.శ్రీనివాసరావు, డాక్టర్ పి.గోపాల్ కృష్ణ, సర్పంచ్ త్రినాథ రావు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కౌలు రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని సిఐటియు నాయకులు కొల్లి సాంమూర్తి కోరారు. స్థానిక తహశీల్దార్ సాయి కామేశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆదుకుంటామని చెప్పడమే తప్ప కౌలు రైతులకు ఎటువంటి భరోసా కల్పించిన పరిస్థితి ఉందని అన్నారు. మండలంలో సుమారు 1200 మంది వరకు కౌలు రైతులు ఉన్నారన్నారు. గతేడాది 618మంది కౌలు రైతులను గుర్తించిన ప్పటికీ వారిలో కొంతమంది ఎటువంటి రుణాలు కూడా పొందే పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ .20వేలు పెట్టుబడి సహాయం ఇవ్వాలని, భూ యజమాని సంతకం లేకపోయినా కౌలు రైతుల కింద ప్రతి కౌవులు రైతులను గుర్తించేలా చర్యలు చేపట్టి గుర్తింపు కార్డులిచ్చి ఆదుకోవాలని కోరారు. గతంలో బ్యాంకుల ద్వారా రుణం లోను వాడిన కౌలు రైతులు రీ షెడ్యూల్ చేసి, ఏ పంట వేసినా దానికి ఈ క్రాప్ విధానం ద్వారా రైతులను ఆదుకోవాలని కోరారు. కౌలు రైతుల సమస్యలపై ఈనెల 11న మంగళగిరిలోని వ్యవసాయ శాఖ కమిషనర్ ఆఫీస్ వద్ద చలో కార్యక్రమం జరగనుందని, కౌలు రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు వెంకటేష్ సుబ్బారావు పాల్గొన్నారు.

పెండింగ్ ఉపాధి బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఉపాధి హామీ పనులు చేసిన వేతనదారులకు మూడు నెలలుగా బకాయి ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివన్న నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొమరాడలో వేతనదారులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు చేసి తొమ్మిది వారాలుగా కూలీలకు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు పూటలా మండుటెండల్లో ఉపాధి పనులు చేయడంతో అనారోగ్యం పాలై కూలీలు ఆసుపత్రి పాలయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలు పని చేసే చోట మౌలిక వసతులైన తాగునీరు, టెంట్లు, మజ్జిగ, మెడికల్ కిట్లు వంటివి లేకపోవడంతో అసౌకర్యానికి గురైతున్నారన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఏడాది 200 రోజు పని కల్పించాలని, రోజుకు రూ.600 వేతనాలు ఇవ్వాలని, ఇంతవరకు ఉన్న పెండింగ్ 9 వారాలకు సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిచో భవిష్యత్తులో వేతనదారులతో కలిసి పెద్ద ఎత్తున ఎంపిడిఒ, కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, ఉపాధి హామీ వేతనదారులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధిహామీ వేతనదారులు

గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వర్ణాంధ్ర. 2047 అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా మట్టి బొమ్మలను తయారు చేయడం కూడా నేర్పించారు. ఈనెల 5న ఖోఖో పోటీలు నిర్వహిస్తామని ఇన్‌ఛార్జి శాఖ గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు అన్నారు. ఈనెల 6న బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయకులు ఈశ్వర్ పాల్గొన్నారు.

కాలిపోయిన ఇంటిని పరిశీలించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కొమరాడ

విద్యుత్ షార్క్ సర్క్యూట్‌లో కాలిపోయిన ఇంటిని టిడిపి నాయకులు పరిశీలించి ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయాన్ని అందజేస్తామని టిడిపి సీనియర్ నాయకులు, విక్రమపురం ఎంపిటిసి సభ్యులు దేవకోటి వెంకట నాయుడు అన్నారు. మంగళవారం రాత్రి మార్కొండపుట్టి లో విద్యుత్ షార్క్ సర్క్యూట్‌తో కాలిపోయిన బోనెల మరియమ్మ ఇంటిని బుధవారం స్థానిక టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విఆర్ఒ సుజాత ఆధ్వర్యంలో కాలిపోయిన ఇంటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదంలో కాలిపోయిన నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరిన అడిగి తెలుసుకుని నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టిలో పెట్టి సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



కురుపాంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మొండెంఖల్‌లో టిబిఎంబిపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెఖల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో టిబి ముక్త్ భారత్ అభియాన్‌పై వైద్యాధికారి డాక్టర్ బి.ప్రజ్ఞ బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయపై దేశం చేస్తున్న పోరాటాన్ని వేగవంతం చేయడానికి 2025 నాటికి వ్యాధిని నిర్మూలించాలని నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. టిబి ఉన్నప్పుడు సాధారణంగా కనిపించే లక్షణాలు దగ్గు కొన్నిసార్లు కఫం, రక్తము పడడం, చాతినొప్పి, బలహీనత, బరువు తగ్గటం, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం ఈ లక్షణాలు ఉన్నట్టు అయితే దగ్గరలో ఉన్న వైద్య సిబ్బందిని సంప్రదించడం వల్ల చికిత్స చేయడం జరుగుతుందని టిబి చికిత్స చేయగల, నయం చేయగల వ్యాధి అని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి : టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీ పురం : జియమ్మ మండలంలోని ఇటికలో టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జగదీశ్వరి పాల్గొన్నారు. అవగాహన కార్యక్రమంలో కూటమి నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశు దాణా పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సబ్సిడీపై పశువుల దాణాను బుధవారం జియమ్మ వలస మండలం ఇటికలో పాడి రైతులకు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పంపిణీ చేశారు. రూ. 1110లు విలువ చేసే 50 కిలోల పశు దాణా బస్తా పాడి రైతులకు కూటమి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై రూ. 555కు అందిస్తోందని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బొంగు సురేష్, నాయకులు డొంకాడ రామకష్ణ, నందివాడ కృష్ణబాబు, మూడడ్ల సత్యంనాయుడు, పల్లా రాంబాబు, గురానా శ్రీరామూర్తినాయుడు, జోగి భుజంగారావు, పశువైద్యాధికారి డా. నందివాడ మునికుమార్ బాబు, పశువైద్య సిబ్బంది, లబ్ధిదారులు, పాడిరైతులు పాల్గొన్నారు.

చిదిమిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమిలో స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్యతనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శాంతి కుమారి, సిహెచ్ఒ, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

మెనూ పక్కాగా పాటించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వ అమలు చేయనున్న మెనూను వంట నిర్వాహకులు పక్కాగా పాటించాలని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఎంఇఒ-2 ఎ.వెంకటరమణ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒమాట్లాడుతూ పిల్లలకు వంట చేసే సమయంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని, మధ్యాహ్న భోజనం పథకంలో ఎటువంటి అవకతవకులకు చోటు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. అలాగే నాణ్యతా ప్రమాణాలు కూడా పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విజయ్ వాహిణీ చారిటబుల్ ఫౌండేషన్ . టాటా ట్రస్ట్ ప్రతినిధి పి. జగన్ మోహన్ రావు, మధ్యాహ్నం భోజనం పథకం నిర్వాహకులు పాల్గొన్నారు

ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉపాధి హామీ వేతనాలు వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ నాయకులు వి.దాలి నాయుడు, సిరిసిపల్లి సాయిశ్రీనివాస్, తీళ్ల గౌరీశంకరరావు, గేదెల రామకృష్ణ డిమాండ్ చేశారు. పార్వతీపురం మండలంలోని సాకిగెడ్డ కాలువ పనులు చేస్తున్న బందలుప్పి గ్రామానికి చెందిన ఉపాధి హామీ వేతనదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నేటి ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని ఆరోపించారు. వేతనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. గత ఎనిమిది వారాలుగా ఉపాధి హామీ బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే 8 వారాల బిల్లులు చెల్లించాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున వేతనదారులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున ఒక్క పూటే ఎండ కాకముందు సమయాన్ని కేటాయించి పనులు నిర్వహించాలన్నారు. పని ప్రదేశాల్లో నీడ కల్పించే టెంట్లు, నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా రోజుకు రూ.600 వేతనాన్ని ఇస్తూ ఏడాదికి 200 రోజులు పని కల్పించాలన్నారు. తక్షణమే బకాయి బిల్లులను చెల్లించాలన్నారు. రైతులు తమ పొలాను బాగు చేసుకునేందుకు ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించాలని కోరారు.



వనధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

నవధాన్యాల సాగుతో మేలు

ప్రజాశక్తి - పాచిపెంట

వరికి ముందుగా రైతులు నవధాన్యాలు సాగు చేసి కలియదున్ని వరి నాట్లు వేసుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని విశ్వనాధపురంలో ప్రకృతి సేద్య ఎల్2 కొండేటి విజయ్ ఆధ్వర్యంలో రైతు కిర్ల ధనుంజయ్ పత్తి సాగుకు ముందుగా వేసిన నవధాన్యాల పంటను పరిశీలించిన సందర్భంగా మాట్లాడుతూ నవధాన్యాలు అన్ని పంటలకు ముందుగా సాగు చేసుకుని 30 నుంచి 40 రోజుల తర్వాత రోటవేటర్ సహాయంతో కలియ దున్నితే భూమిలో సేంద్రీయ కర్బనం పెరుగుతుందని సేంద్రీయ కర్బనాన్ని ఒక్క శాతానికి పెంచగలిగితే రసాయన ఎరువులపై ఖర్చు గణనీయంగా తగ్గుతుందని తెలిపారు ప్రస్తుతం వరి పంట నాట్లుకు ఇంకా చాలా సమయం ఉన్నందున రైతులంతా పచ్చిరొట్ట ఎరువులకు బదులుగా నవధాన్యాలను చల్లుకోవాలని, ఇవి అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం రైతు ధనంజయరావు మాట్లాడుతూ నవధాన్యాలు వేసిన తర్వాత పత్తిలో దిగుబడి, నాణ్యతను పరీక్షిస్తానని రైతులందరికీ తెలియజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి కుమార్ పాల్గొన్నారు.

పాంచాలిలో ప్రకృతి సేద్య గ్రామస్థాయి ప్రణాళిక సమావేశం

సిఆర్పి తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామస్థాయి ఖరీఫ్ ప్రకృతి వ్యవసాయ ప్రణాళిక సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ గూడపు యుగంధర్ మాట్లాడుతూ ప్రతి రైతు నవధాన్యాలు సాగు చేయాలని కొద్ది మొత్తంలోనైనా ప్రకృతి సాగు చేపట్టాలని, ప్రభుత్వం ప్రకృతి సేద్యానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వివిఎ శ్రీను, రైతులు పాల్గొన్నారు

పిడుగు పడి మహిళ మృతి

ప్రజాశక్తి - బలిజిపేట



మండలంలోని పలగరకు చెందిన వావిలపల్లి చంద్రమ్మ పిడుగు పాటుకు గురై బుధవారం మృతి చెందింది. గ్రామం సమీపాన గల చెరువు దిగువున పిడుగు పడి మరణించింది, ఆమెకు భర్త ఉండగా, పిల్లలు లేరు.

భూ సారం పెంచేందుకు పచ్చిరొట్టను వినియోగించాలి


ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఖరీఫ్‌లో భూసారాన్ని పెంచేందుకు భూముల్లో పచ్చిరొట్ట నవరత్న విత్తనాలను తీసుకొని దుక్కిలో కలియ దున్నాలని రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్ ఆధ్వర్యంలో మండలంలోని డికె పట్నం, డి.ములగ, డొకిశీల గ్రామాల్లో బృందాలుగా పర్యటించి రైతులకు సమగ్ర వ్యవసాయం సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే పథకాలు గురించి వరి, మొక్క జొన్న, చిరుధాన్యాల్లో యాజమాన్య పద్ధతులు, ఆయిల్ పాం, జీడి తోటల్లో అంతర్ పంటలు, నవధాన్యాల గురించి, ప్రకృతి వ్యవసాయం, జీవన ఎరువుల, ప్రభుత్వం అందించే పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ జి.అమతవీణ, డాక్టర్ పూర్ణ బిందు, నరసింహమూర్తి, డాక్టర్ ఎస్.ధ్రువ, ఎస్.శ్రీనివాస్‌రాజు (ఉద్యాన విభాగం), కె.విశ్వనాధ్ రెడ్డి, శైలజ (జిల్లా ఉద్యాన శాఖ అధికారి), ఆర్.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎం.అశోక్ మండల వ్యవసాయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ మరమ్మతులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక మెయిన్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ అనేది పలుమార్లు మరమ్మతులకు గురైంది. దీన్ని గుర్తించి గ్రామ పంచాయతీ, విద్యుత్ శాఖ సమన్వయంతో సెంట్రల్ లైటింగ్ మరమ్మతు పనులను బుధవారం చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ప్రజలకు ఎటువంటి సమస్య లేకుండా లైటింగ్ సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బి.రామకృష్ణ, విద్యుత్ శాఖ ఎఇ జి.నీలిమ, విద్యుత్ శాఖ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యుద్దీకరణ పనులను చేయిస్తున్న ఇన్‌ఛార్జి ఎంపిడిఒ, ఎఇ

అభివృద్ధికి దూరంగా ఆర్‌టిసి కాంప్లెక్స్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రయాణికులకు కూర్చునేందుకు ఉన్న టేబుల్స్ పాడయ్యాయి. ఫ్యాన్లు లేని పరిస్థితి. విద్యుత్ దీపాల పరిస్థితి అంతటి మాత్రమే. వివిధ రూట్లో బస్సులు వెళ్లే నేమ్ బోర్డ్లు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేయలేదు. కాంప్లెక్స్‌కు వచ్చే ప్రధాన రహదారి నేటికీ మెరుగుపరచలేదు. దీంతో వర్షం పడితే రోడ్డంతా బురదమయం కావడంతో రాళ్ళు తేలిన రహదారిపై నడవడం కూడా కష్టంగా మారింది. కాంప్లెక్స్ పరిధిలో ఏర్పాటు చేసిన షాపుల ద్వారా ప్రభుత్వానికి నెలకు వేలాది రూపాయలు ఆదాయం వస్తున్న కాంప్లెక్స్‌లో సౌకర్యాలు మెరుగునకు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రధాన సమస్యలను గుర్తించి కాంప్లెక్స్‌లో సౌకర్యాలు మరింత మెరుగుపరచాలని ప్రయాణికులు కోరుతున్నారు.